సాక్షి రంగారెడ్డి

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



వీర్లపల్లి గెలుపులో చౌలపల్లి

గత ఎన్నికల్లో వారిద్దరు ప్రత్యర్థులు.. ప్రస్తుతం ఎన్నికల్లో ఒక్కటై కలిసి పని చేశారు.

14లో▸



కల్వకుర్తి కింగ్ కసిరెడ్డి

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు.

14లో▸



యాదయ్య హ్యాట్రిక్

మూడు పర్యాయాలు ఎన్నికల్లో రాష్ట్రమంతా ఒకవైపు పవనాలు వీస్తే చేవెళ్లలో మాత్రం మరోవైపు వీశాయి.

14లో▸








ఎన్నికల అధికారుల నుంచి ధ్రువపత్రాలు అందుకుంటున్న మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి అభ్యర్థులు సబితారెడ్డి, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి



మహేశ్వరం
పి.సబితారెడ్డి
మెజారిటీ
26,187



చేవెళ్ల
కాలె యాదయ్య
మెజారిటీ
268



ఇబ్రహీంపట్నం
మల్‌రెడ్డి రంగారెడ్డి
మెజారిటీ
36,700



షాద్‌నగర్
వీర్లపల్లి శంకర్
మెజారిటీ
7,128



కల్వకుర్తి
కసిరెడ్డి నారాయణరెడ్డి
మెజారిటీ
5,410

ఎదురుగాలిలోనూ.. షి'కారు'



జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు

- ఐదుచోట్ల బీఆర్‌ఎస్‌దే హవా
- మహేశ్వరం, చేవెళ్ల, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగపల్లిలో గెలుపు
- ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్ 'హస్త'గతం
- ఐదోసారి సబిత, నాలుగోసారి ప్రకాశ్‌గౌడ్, మూడోసారి కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి విజయం
- శాసనమండలి నుంచి శాసనసభకు కసిరెడ్డి నారాయణరెడ్డి
- కొత్తగా అసెంబ్లీకి వీర్లపల్లి శంకర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీచినప్పటికీ.. జిల్లాలో మాత్రం కారు హవా కొనసాగింది. మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుపుబావుటా ఎగురవేశారు. సిటీలో కారు జోరు కొనసాగగా.. శివారు నియోజకవర్గాల్లో మాత్రం హస్తం హవా నడిచింది. పట్టణ ప్రాంతంలోని ఎల్బీనగర్‌లో బీఆర్‌ఎస్ సిట్టింగ్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మళ్లీ విజయం సాధించగా, మహేశ్వరం బీఆఎస్ అభ్యర్థి, మంత్రి సబితా రెడ్డి మరోసారి సత్తా చాటారు. రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.ప్రకాష్‌గౌడ్ వరుసగా నాలుగోసారి విజయం సాధించారు. ఇక శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి అరికెపూడి గాంధీ వరుసగా మూడోసారి గెలుపొందారు. రూరల్ ప్రాంతమైన చేవెళ్లలోనూ కారు అభ్యర్థి కాలె యాదయ్య స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు.

ఆ స్థానాల్లో హస్తం హవా

ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించగా, కల్వకుర్తిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపొందారు. షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకరయ్య తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.

వికసించని కమలం

ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బీజేపీకి మంచి పట్టుంది. ఆయా స్థానాల్లో బలమైన అభ్యర్థులనే బరిలోకి దించింది. ప్రధాని మోదీ తుక్కుగూడ వేదికగా ప్రచారం చేశారు. హోంమంత్రి అమిత్‌షా రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో రోడ్‌షోలు నిర్వహించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎల్బీనగర్, కల్వకుర్తిలో రోడ్‌షోల్లో పాల్గొన్నారు. అయినా ఆ పార్టీ అభ్యర్థులు గెలవలేకపోయారు. ఆశించిన ఫలితాలు రాక కార్యకర్తలకు నిరాశనే మిగిల్చింది.

ఆదరించినందుకు కృతజ్ఞతలు

మూడుసార్లు గెలిపించి ఆదరించినందుకు ప్రజలకు రుణపడి ఉంటా. నాపై పూర్తి విశ్వాసం ఉంచి భారీ ఆధిక్యంతో గెలిపించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే మరోసారి గెలిపించాయి.

– సబితారెడ్డి, మహేశ్వరం

రుణం తీర్చుకోలేనిది

వరుసగా మూడుసార్లు విజయాన్ని అందించిన చేవెళ్ల ప్రజల రుణం తీర్చుకోలేనిది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు. నా గెలుపుకోసం కష్ట పడి పనిచేసిన పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాను.

– కాలె యాదయ్య, చేవెళ్ల

ఈ గెలుపు మర్చిపోలేనిది

ఈ గెలుపు మర్చిపోలేనిది. నియోజకవర్గ ప్రజలకే ఈ విజయం అంకితం. నా గెలుపు కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తా.

– మల్‌రెడ్డిరంగారెడ్డి, ఇబ్రహీంపట్నం

కార్యకర్తలకు అంకితం

నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ చమటోడ్చారు. ఎన్నికల్లో నా గెలుపు కోసం ఎంతో శ్రమించారు. ఈ విజయం వారికే అంకితం.

– వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్

ఇది ప్రజా విజయం

ఇది ప్రజా విజయం. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కల్వకుర్తి ప్రజలు ఆదరించి నమ్మకంతో గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా సేవకుడిలా ఉంటా. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా.

– కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి



మీర్‌పేటలో బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



షాద్‌నగర్‌లో సంబరాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

అలా బీఆర్‌ఎస్ బోణీ కొట్టింది

ఎల్బీనగర్, మహేశ్వరంలో తొలిసారిగా విజయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే కాదు, తర్వాత అధికారంలో ఉండగా జరిగిన ఎన్నికల్లోనూ ఆ రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్ ఖాతా తెరవలేక పోయింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఆరు స్థానాల్లో విజయం సాధించారు. మహేశ్వరం, ఎల్బీనగర్‌లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు గెలవలేకపోయారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన అభ్యర్థులే.. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరపున అదే స్థానాల నుంచి పోటీ చేశారు. ఆశించిన దానికంటే అత్యధిక ఓట్లు సంపాదించి విజయం సాధించారు.

మహేశ్వరంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైంది. తొలి ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున పటోళ్ల సబితారెడ్డి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత అప్పట్లో చోటు చేసుకున్న పలు రాజకీయ సమీకరణాలతో ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో నిర్వహించిన తొలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డి ఇదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్ తరపున పోటీలో నిలిచిన టీకేఆర్ ఓటమి పాలై, కాంగ్రెస్ అభ్యర్థి పటోళ్ల సబితారెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆమె కాంగ్రెస్‌ను వీడి అధికారపార్టీలో చేరి మంత్రిగా కొనసాగుతున్నారు. 2023 ఎన్నిల్లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచి, ఆ పార్టీకి తొలిసారిగా విజయం సాధించి పెట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ బీఆర్‌ఎస్ ఖాతా తెరవలేదనే ప్రచారానికి చెక్ పెట్టారు.

ఎల్బీనగర్‌లో..

అప్పటి వరకు మలక్‌పేట్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న ఎల్బీనగర్ 2009లో కొత్త నియోజకవర్గంగా ఆవిర్భవించింది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీడీపీ నుంచి ఎస్వీ కృష్ణ ప్రసాద్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి రామ్మోహన్‌గౌడ్, టీడీపీ నుంచి కృష్ణయ్య పోటీ చేయగా కృష్ణయ్య గెలుపొందారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి రామ్మోహన్‌గౌడ్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌ను వీడి అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. 2023లో బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి గెలిచారు. ఇప్పటి వరకు ఇక్కడ గెలుపొందని కారు పార్టీకి ఆయన తొలి విజయాన్ని అందించారు.

మంచాల నాయబ్ తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

- పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు తెరిచిన అధికారులు
- ఇబ్రహీంపట్నం ఆర్వో, ఏఆర్వోలకు షోకాజ్ నోటీసులు

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు తెరిచిన ఘటనలో.. సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టింది ఎలక్షన్ కమిషన్. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు ఓపెన్ చేసి ఉండటాన్ని గమనించిన కాంగ్రెస్ శ్రేణులు శనివారం రాత్రి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ భారతి హోళికేరి అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని సముదాయించారు. దీనిపై విచారణ చేపట్టిన ఆమె పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను ఏజెంట్లు లేకుండా ఎలా ఓపెన్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల ఇన్‌చార్జి, మంచాల మండల నాయబ్ తహసీల్దార్ తారకేశ్వరెడ్డి బాక్స్‌ల నిర్వహణ అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేల్చారు. ఈ మేరకు కలెక్టర్ అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇబ్రహీంపట్నం ఆర్వో అనంతరెడ్డి, ఏఆర్వో ప్రసాద్‌రావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వరుస విజయాలు

- ఐదోసారి సబిత
- నాలుగోసారి ప్రకాష్‌గౌడ్
- మూడోసారి కాలె యాదయ్య

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొంత మంది నేతలు పార్టీలకు అతీతంగా ప్రజాదరణ పొందుతూనే ఉన్నారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి మనసులో సుస్థిర స్థానం సంపాదించుకుంటున్నారు. పార్టీ ఏదైనా..పోటీ చేసే ప్రాంతం ఏదైనా.. పొలిటికల్ వేవ్‌లకు భిన్నంగా వరుస విజయాలతో హ్యాట్రిక్ వీరులుగా రాజకీయ చరిత్రలో నిలిచిపోతున్నారు. వారే ఎమ్మెల్యేగా ఐదోసారి విజయం సాధించిన పటోళ్ల సబితారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాలుగోసారి విజయం సాధించిన టి.ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల నుంచి విజయం సాధించిన కాలె యాదయ్య. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా..వీరు మాత్రం బీఆర్‌ఎస్ నుంచే గెలుపొందడం విశేషం.

ఓటమి ఎరుగని నేత సబిత

మాజీ మంత్రి పటోళ్ల ఇంద్రారెడ్డి అకాల మరణంతో రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన సతీమణి సబితారెడ్డి ఓటమి ఎరుగని నేతగా రికార్డు సృష్టించారు. ఐదుసార్లు బరిలో నిలిచి విజయకేతనం ఎగురవేశారు. 2000లో చేవెళ్ల నియోజక వర్గానికి నిర్వహించిన ఉప ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. 2004లో అదే స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. దివంగత నేత వైఎస్సార్ కేబినెట్లో గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రిగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో చేవెళ్ల స్థానం ఎస్సీకి రిజర్వ్ కావడంతో ఆమె మహేశ్వరం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. హోంమంత్రిగా పని చేశారు. 2014లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2018లో మళ్లీ మహేశ్వరం నుంచి పోటీ చేశారు. తర్వాత కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. 2023లో తొలిసారి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి, విజయం సాధించారు. గత ఎన్నికల్లో తొమ్మిది వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందితే.. ఈసారి ఏకంగా 27 వేల ఓట్ల ఆధిక్యత సాధించడం గమనార్హం.

నాలుగోసారి ప్రకాశ్‌గౌడ్ దౌడ్

రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.ప్రకాష్‌గౌడ్ వరుసగా నాలుగోసారి విజయం సాధించారు. మైలార్‌దేవ్‌పల్లి గౌడ సామాజిక వర్గానికి చెందిన ఆయన ఏడో తరగతి వరకే చదువుకున్నారు. కానీ రాజకీయాల్లో మాత్రం అశేష జనాదరణ పొందుతూ వరుస విజయాలను సొంతం చేసుకున్నారు. స్వతహాగా ఆయన ఎన్టీఆర్‌కు వీరాభిమాని. రాజేంద్రనగర్ మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడిగా, పార్టీ నాయకుడిగా, కార్యకర్తగా పనిచేశారు.

2009లో కొత్తగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పడడంతో టీడీపీ నుంచి తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా గెలుపొంది, ఆ తర్వాత కొద్ది కాలానికే బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 పార్టీ అభ్యర్థిగా నిలిచి మూడోసారి విజయం సాధించారు. 2023లోనూ మళ్లీ బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. వరుసగా నాలుగుసార్లు ఒకే నియోజకవర్గం నుంచి విజయం సాధించి చరిత్ర సృష్టించారు.

స్వల్ప ఓట్లతేడాతో హ్యాట్రిక్

చేవెళ్ల నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య ముచ్చటగా మూడోసారి విజయం సాధించారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం చించల్‌పేటకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన 1980లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1993–1996 మధ్య కాలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. 1992–95 మధ్య డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా, ఆ తర్వాత 1995–2000 మధ్య కాలంలో నవాబుపేట జెడ్పీటీసీగా, 2001 నుంచి 2006 వరకు నవాబుపేట ఎంపీపీగా, 2008–2010 వరకు టీటీడీ బోర్డు మెంబర్‌గా పని చేశారు. యూత్ కాంగ్రెస్ నుంచి పీసీసీ మెంబర్ వరకు అనేక రకాల పదవుల్లో పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి టీడీపీ అభ్యర్థి రత్నం చేతిలో ఓటమి పాలయ్యారు. 2014లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కేఎస్ రత్నంపై గెలుపొందారు. ఆ తరువాత బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2023లో మళ్లీ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్ల ఆందోళన

ఆలస్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

షాద్‌నగర్: ఓట్ల లెక్కింపు కేంద్రంలో కౌంటింగ్ ఏజెంట్లకు సరైన సామగ్రిని అధికారులు సమకూర్చకపోవడంతో ఏజెంట్లు కొద్ది సేపు ఆందోళన చేపట్టారు. షాద్‌నగర్ అసెంబ్లీకి సంబంధి ఓట్ల లెక్కింపును హయత్‌నగర్ మండలం గండిపేట సమీపంలో లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా కేంద్రంలో అధికారులు రాక్స్, పేపర్లు, సదుపాయాలు సరిగా కల్పించ లేదని ఆరోపిస్తూ కౌంటింగ్‌కు వెళ్లిన ఏజెంట్లు కొద్ది సేపు ఆందోళన చేపట్టారు.

ఆలస్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆలస్యంగా కొనసాగింది. క్యూ ఆర్ కోడ్ సరిగా ఓపెన్ కాకపోవడంతో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఆలస్యమైంది. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కించి అరగంటలో ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. కానీ 10 గంటలకు నేరుగా ఈవీఎం యంత్రాలకు సంబంధించి మొదటి రౌండ్ ఫలితాలను అధికారులు వెల్లడించారు. సాయంత్రానికి అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను వెల్లడించారు. మొత్తం 1,595 ఓట్లు పోలవగా అందులో 32 ఓట్లను రిజెక్టు చేశారు. 35 ఓట్లను ఇన్‌వ్యాలీడ్ ఓట్లుగా ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు 870 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 304, ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీకి 225, బీజేపీకి 86, నోటాకు 5 ఓట్లు పోలయ్యాయి.

చేవెళ్లలో హోరాహోరీ

- పది రౌండ్లలో బీఆర్‌ఎస్ ఆధిక్యం
- 12 రౌండ్లలో కాంగ్రెస్ లీడ్
- రీకౌంటింగ్ కోరిన కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్
- ఐదు బూత్‌లలో మరోసారి లెక్కింపు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకు 268 ఓట్ల స్వల్ప మెజార్టీ



చేవెళ్ల ఎన్నికల కౌంటింగ్

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో హోరాహోరి పోరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య గెలుపొందారు. ఉత్కంఠగా సాగిన కౌంటింగ్‌లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో హ్యాట్రిక్ విజయం అందుకున్నారు. హిమాయత్‌సాగర్‌లోని లార్డ్స్ కాలేజీలో 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదటి రౌండ్ నుంచి కాలె యాదయ్య స్వల్ప ఆధిక్యంతో కొనసాగారు. పదో రౌండ్ వరకు 6,900 పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించారు. 10వ రౌండ్ నుంచి 19వ రౌండ్ వరకు కాంగ్రెస్ స్వల్ప మెజార్టీ సాధిస్తూ వచ్చి బీఆర్‌ఎస్ లీడ్‌ను 544కు తగ్గింగించింది. 20 రౌండ్‌లో యాదయ్యకు 700 పైచిలుకు ఓట్ల మెజార్టీ రావడంతో ఆయన మెజార్టీ 1,200 దాటింది.చివరి రెండు రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు స్వల్ప మెజార్టీ రావడంతో యాదయ్య మెజార్టీ 800 పైచిలుకుకు తగ్గింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 590 ఓట్ల లీడ్ వచ్చినా ఆయనకు ఓటమి తప్పలేదు. చివరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్య 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలిచారు.

రీకౌంటింగ్‌కు పట్టుబట్టిన కాంగ్రెస్ అభ్యర్థి..

బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్యకు 268 ఓట్ల మెజార్టీ రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ రీకౌంటింగ్ చేయాలని అధికారులను కోరారు. ఐదు పోలింగ్ బూత్‌ల కౌంటింగ్‌పై అనుమానం ఉందని.. ఆ పోలింగ్ బూత్‌లలో పోలైన ఓట్లకంటే కౌంటింగ్ సమయంలో ఓట్లు తక్కువగా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు ఐదు పోలింగ్ బూత్‌లలో రీకౌంటింగ్ చేశారు. మొత్తం రీకౌంటింగ్ చేయాలని భీంభరత్ పట్టుబట్టగా అధికారులు మాత్రం మొత్తం చేయలేమని తేల్చి చెప్పడంతో ఆయన కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. అధికారులు బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్య గెలుపొందినట్లు ధ్రువపత్రం అందజేశారు.

వీర్లపల్లి గెలుపులో చౌలపల్లి

- ఫలించిన నాయకుల వ్యూహం
- కంచుకోటను చేజిక్కించుకున్న ఇద్దరు నేతలు


వీర్లపల్లి శంకర్‌తో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: గత ఎన్నికల్లో వారిద్దరు ప్రత్యర్థులు.. ప్రస్తుతం ఎన్నికల్లో ఒక్కటై కలిసి పని చేశారు. చేజారిన కంచుకోటను తిరిగి దక్కించుకొని కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారు. షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపులో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఇద్దరు నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయఢంకా మోగించారు.

కీలకంగా ప్రతాప్‌రెడ్డి

గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ టికెట్ ఆశించి భంగపడటంతో తిరిగి తన అనుచరగణంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శంకర్ గెలుపులో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిలు కీలకంగా వ్యవహరించి విజయంలో భాగస్వామ్యం అయ్యారు.

16వ ఎమ్మెల్యేగా వీర్లపల్లి

షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు అయినప్పటి నుంచి నేటి వరకు 16సార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ 11సార్లు, టీడీపీ 2సార్లు, టీఆర్ఎస్ 2సార్లు విజయం సాధించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్ బీఆర్ఎస్‌పై విజయం సాధించారు. గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి బరిలో నిలిచి ఓటమి పాలైన వీర్లపల్లి శంకర్ ఈసారి కాంగ్రెస్ నుంచి టికెట్ సాధించి విజయం సాధించారు. నియోజకవర్గంలో వ్యక్తిగతంగా మంచి పేరు సంపాదించడంతో పాటుగా, బలహీనంగా ఉన్న పార్టీని బలోపేతం చేసేందుకు అందరిని కలుపుకొని ముందుకు సాగారు.

మరింత కష్టపడి పనిచేద్దాం

కార్యకర్తలను సముదాయించిన రోహిత్‌రెడ్డి

తాండూరు: బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండు రౌండ్లు మిగిలి ఉండగానే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చేశారు. యాలాల మండలం బీఆర్ఎస్ పార్టీకి భారీ ఆధిక్యం తెచ్చిపెడుతోందని అంతా భావించారు. అయితే అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ కట్టబెట్టింది. అప్పటికే మనోహర్‌రెడ్డి దాదాపు 6వేల వరకు ఆధిక్యంలో ఉన్నారు. బషీరాబాద్ మండలానికి సంబంధించి రెండు రౌండ్ల వరకు కూర్చొని ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి సొంత మండలంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని గ్రహించి కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చేశారు. ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఒక్కసారిగా పైలెట్ దగ్గరకు వచ్చి కన్నీటి పర్యంతమవ్వగా వారిని ఆయన సముదాయించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీచిందన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్‌లో మరింత కష్టపడి పనిచేద్దామని వారికి భరోసానిచ్చారు.

కల్వకుర్తి కింగ్ కసిరెడ్డి

- 5410 ఓట్ల మెజార్టీతో గెలుపు
- రెండోస్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి ఆచారి


కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన పోరులో కాంగ్రెస్‌పార్టీ సత్తా చాటింది. రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన కసిరెడ్డి నారాయణరెడ్డి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, వ్యక్తిగత మేనియాకు ప్రజలు జైకొట్టారు. కసిరెడ్డి సమీప ప్రత్యర్థి బీజేపీ నేత ఆచారిపై 5410 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 24 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధాన పోటీ కసిరెడ్డి నారాయణరెడ్డి(కాంగ్రెస్), జైపాల్ యాదవ్(బీఆర్ఎస్), ఆచారి(బీజేపీ)ల మధ్యే నడిచింది. నియోజకవర్గంలో మొత్తం 2,41,762 ఓట్లకు 2,01,285 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కల్వకుర్తి ఓట్ల లెక్కింపు 19 రౌండ్లుగా నిర్వహించారు. తొలి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ అభ్యరి ఆచారిల మధ్యే హోరాహోరీ సాగింది. కసిరెడ్డి నారాయణరెడ్డికి 75,858 ఓట్లు, ఆచారికి 70448 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు 42847 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఆచారిపై కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి 5410 ఓట్లతో గెలుపొందారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ మూడవస్థానానికి పరిమితమయ్యారు. 2014 ఎన్నికల్లో 72 ఓట్లతో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి ఆచారి 2018 ఎన్నికలలో 3 వేల ఓట్లతో ఓడిపోయారు. ప్రస్తుతం 5410 ఓట్లతో ఓటమి చవిచూశారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారి శ్రీను నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

స్వగ్రామంలో వెనుకబడిన జైపాల్‌యాదవ్

బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్వగ్రామమైన కడ్తాల మండలం చల్లంపల్లిలో కాంగ్రెస్ ఆధిక్యత చాటుకోగా బీజేపీ రెండవస్థానంలో నిలిచింది. జైపాల్‌యాదవ్ మూడవస్థానంతో సరిపెట్టుకున్నారు. బీజేపీ అభ్యర్థి ఆచారి స్వగ్రామమైన ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలో స్పష్టమైన ఆధిక్యత కనబర్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి స్వగ్రామమైన తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో ఆధిక్యతను చాటుకున్నారు.

డిపాజిట్లు గల్లంతు

- బీజేపీ, సీపీఎంలకు గతంలో కంటే తగ్గిన ఓట్లు
- బీఆర్ఎస్‌కు పెరిగిన ఓటింగ్
- సీపీఎంకు 8710 ఓట్లు
- బీజేపీకి 15064 ఓట్లు
- బీఆర్ఎస్‌కు పెరిగిన 12వేల ఓట్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధించాడు. 35 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందాడు. నియోజకవర్గంలో 2,45,302 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,24,447 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 84,320 ఓట్లు వచ్చాయి. మూడుసార్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పనిచేశారు. గతంలో 72356 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం గతం కంటే 12 వేల ఓట్లు అత్యధికంగా సాధించారు.

సీపీఎం, బీజేపీలకు డిపాజిట్ల గల్లంతు

ఇబ్రహీంపట్నంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీఎం పార్టీ ప్రభావం తగ్గిపోతుంది. 1989లో 1994, 2004లో సీపీఎం అభ్యర్థులు ఎమ్మెల్యేలు గెలిచారు. అప్పటి నుంచి బలమైన పార్టీగా ఉన్న సీపీఎం రాను రాను ప్రభావం తగ్గిపోయింది. 2018 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి 9,560 ఓ.8ట్లు సాధించింది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 3,877 వచ్చాయి.

బీజేపీకి తగ్గిన ఓట్లు..

నియోజకవర్గంలో బీజేపీకి గ్రామీణస్థాయిల్లో బలమైన కేడర్ ఉంది. ప్రస్తుతం బీజేపీ నుంచి పోటీ చేసిన నోముల దయానంద్‌గౌడ్ అంతగా ప్రభావం చూపలేకపోయాడు. 2018 ఎన్నికల్లో 19వేలకు పైచిలుకు ఓట్లు వస్తే ప్రస్తుతం 15064ఓట్లు వచ్చాయి. గత ఓటర్లను కాపాడుకోలేక పోయారు. మొత్తానికి ఇబ్రహీంపట్నంలో సీపీఎం, బీజేపీలు డిపాజిట్లు కోల్పోయారు.

బాలికను తప్పించబోయి..

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

బొంరాస్‌పేట: బైక్‌కు అడ్డంగా వచ్చిన బాలికను తప్పించబోయి ఓ హోంగార్డుకు మృతి చెందాడు. దౌల్తాబాద్ మండలం అల్లాపూర్‌కు చెందిన కృష్ణ యాదవ్(35) హైదరాబాద్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం కొడంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కృష్ణ యాదవ్ బైక్‌కు బొంరాస్‌పేట మండలం బొట్లోని తండా ఆశ్రమ పాఠశాల వద్ద అకస్మాత్తుగా వైశాలి అనే బాలిక అడ్డుగా వచ్చింది. ఆమెను తప్పించబోయిన కృష్ణ యాదవ్ బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు.. కృష్ణయాదవ్‌ను వెంటనే కొడంగల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో బాలిక ఎడమకాలికి స్వల్ప గాయాలయ్యాయని.. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాదయ్య హ్యాట్రిక్

- బీఆర్ఎస్‌కు పట్టం కట్టిన చేవెళ్ల ఓటర్లు
- 268 ఓట్లతో గట్టెక్కిన కాలె యాదయ్య


ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: గత మూడు పర్యాయాలుగా శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఒకవైపు పవనాలు వీస్తే చేవెళ్లలో మాత్రం మరోవైపు వీశాయి. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న నవాబుపేట మండలాన్ని చేవెళ్ల నియోజకవర్గంలో కలిపారు. దీంతో అప్పటి వరకు జనరల్ నియోజకవర్గంగా ఉన్న చేవెళ్ల అసెంబ్లీ స్థానం ఎస్సీకి రిజర్వుడ్ అయ్యింది. నవాబుపేట మండలంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటంతోనే చేవెళ్ల నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ చేవెళ్లలో మాత్రం టీడీపీ అభ్యర్థి కేఎస్.రత్నంకు గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చేవెళ్ల కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. మాజీ మంత్రులు ఇంద్రారెడ్డి, సబితారెడ్డికి తిరుగులేని స్థానంగా ఉండేది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేవెళ్లను సెంటిమెంట్‌గా భావించేవారు. ఏ కార్యక్రమం తీసుకున్నా చేవెళ్ల నుంచి ప్రారంభించేవారు. అలాంటి కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న చేవెళ్ల స్థానం ఎస్సీకి రిజర్వుడ్ కాగానే కాంగ్రెస్ కంచుకోటకు బీటలు వారాయి. మొదటి సారిగా టీడీపీ అభ్యర్థి కేఎస్.రత్నం, కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్య మీద 2,250 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అనంతరం కేఎస్.రత్నం టీడీపీకి రాజీనామా చేసిన 2014 సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు టీఆర్ఎస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో కేఎస్ రత్నం టీఆర్ఎస్ తరఫున పోటీ చేయగా.. కాలె యాదయ్య రెండోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారం చేపట్టగా.. చేవెళ్లలో మాత్రం మళ్లీ రివర్స్ తీర్పు వచ్చింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్య 681 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. గెలుపు అనంతరం యాదయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి అప్పుడు అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌లో చేరారు.

2018లో మళ్లీ ఇరువురు పోటీ...

2018లో జరిగిన ఎన్నికలకు ముందు వరకు కాలె యాదయ్య ఎమ్మెల్యేగా.. రత్నం సైతం టీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారు. టీఆర్ఎస్ టికెట్ ఆశించిన రత్నంకు టికెట్ ఇవ్వకుండా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న యాదయ్యకే అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో కేఎస్.రత్నం టీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి బరిలోకి దిగారు. అయినా చేవెళ్ల ప్రజలు మళ్లీ టీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకే పట్టం గట్టారు. దీంతో యాదయ్య మొదట కాంగ్రెస్ తరఫున రెండోసారి టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఈ సారి (2023) రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ గాలివీయగా చేవెళ్లలో మాత్రం మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి యాదయ్య స్వల్ప మెజార్టీ (268 ఓట్లు)తో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై గెలుపొందారు.

సొసైటీ డైరెక్టర్‌గా రాజకీయ అరంగేట్రం

ఎమ్మెల్యేగా మూడోసారి విజయం సాధించిన కాలె యాదయ్య

నవాబుపేట: పేద కుటుంబం నుంచి వచ్చిన కాలె యాదయ్య.. రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగారు. రైల్వేలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌గా పని చేసుకొనే కాలె.. సింగిల్ విండో డైరెక్టర్‌గా రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం సభ్యుల సహకారంతో చించల్‌పేట సింగిల్ విండో చైర్మన్, అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి నవాబుపేట జెడ్పీటీసీగా గెలుపొందారు. ఆ తరువాత చించల్‌పేట ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. 2008లో వికారాబాద్ అసెంబ్లీకి(అప్పుడు నవాబుపేట మండలం వికారాబాద్‌లో ఉంది) జరిగిన ఉప ఎన్నికల్లో టికెట్ ఆశించినప్పటికీ రాలేదు.దీంతో నిరాశకు గురైన యాదయ్యకు వైఎస్సార్.. టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. 2009లో చేవెళ్ల టికెట్ దక్కినప్పటికీ 2,249 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ కార్యదర్శిగా నియమించింది. 2014 సాధారణ ఎన్నికల్లో పార్టీ.. మరోసారి యాదయ్యకు టికెట్ ఇవ్వగా.. 781 స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. గెలిచిన ఏడాది తరవాత టీఆర్ఎస్‌లో చేరారు. 2018లో టీఆర్ఎస్ నుంచి టికెట్ పొంది రెండోసారి ఎన్నికయ్యారు. 2023లో అదే పార్టీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై 262 ఓట్ల మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించారు.

ఫార్మాసిటీ, మైనింగ్ జోన్ రాకుండా చేస్తాం

- ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ జెండా ఎగరడం సంతోషం
- ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి


ముదిరెడ్డి కోదండరెడ్డి, ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు

యాచారం: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ ఇచ్చి తల్లి సోనియమ్మ రుణం తీర్చుకున్నారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. కేసీఆర్ పదవీ అహంకారంతో విర్రవీగారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులను సర్వనాశనం చేశారని అన్నారు. వ్యవసాయ రంగానికి ఉన్న రాయితీలన్నీ రద్దు చేసి రైతాంగాన్ని ఆగం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ పథకాల హామీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 40 వేలకు పైగా మెజార్టీ రావడం సంతోషంగా ఉందన్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులో కేసీఆర్ సర్కార్ తలపెట్టిన ఫార్మాసిటీని రద్దు చేస్తామన్నారు. టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేసిన రైతుల పట్టా భూముల రికార్డులను సరి చేసేలా కృషి చేస్తామని అన్నారు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులను కేసీఆర్ సర్కార్ అనేక ఇబ్బందులు పెట్టిందని, కేసులు నమోదు చేయించి జైలుకు పంపిందని అన్నారు. అలాగే మండలంలో తలపెట్టిన మైనింగ్ జోన్‌ను రద్దు చేస్తామని చెప్పారు. యాచారం, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో స్టోన్ క్రషర్లు, క్వారీలు రాకుండా చూస్తామని తెలిపారు. ఇన్నాళ్లు స్టోన్ క్రషర్ల, క్వారీల ఏర్పాటులో వ్యాపారులు కొంత మంది రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారుల అండతో చెలరేగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక అలాంటివి జరగవని వెల్లడించారు.

బాల్యం నుంచే చదివే అలవాటు చేయాలి

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బందెప్పగౌడ్

అనంతగిరి: భగవద్గీత వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే గ్రంథమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బందెప్ప గౌడ్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సంకల్ప్ విద్యాపీఠంలో భగవద్గీత జిల్లాస్థాయి శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బందెప్పగౌడ్ మాట్లాడుతూ.. భగవద్గీత ప్రతి మనిషి జీవితానికి శక్తివంతమైన ఔషధమన్నారు. బాల్యం నుంచే పిల్లలకు చదివే అలవాటు చేస్తే వారికి ఆధ్యాత్మిక ఆలోచనలు అలవడుతాయన్నారు. పోటీల్లో.. పూర్వ ప్రాథమిక స్థాయిలో జాహ్నవి, ప్రాథమిక స్థాయిలో కాత్యాయని, మాధ్యమిక స్థాయిలో రేవంత్, ఉన్నత స్థాయిలో అక్షర, కళాశాల స్థాయిలో మహేందర్ ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీలతారెడ్డి, ప్రశాంత్, శిరీష, ప్రభాకర్, కృష్ణ, ధనిశెట్టి, అనురాధ పాల్గొన్నారు.

ఆనంద్‌కు స్వగ్రామంలో షాక్

ధారూరు: సొంత మండలం, సొంత గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు ఓటర్లు షాక్ ఇచ్చారు. ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌కు ధారూరు మండలంలో 2,774 ఓట్ల మెజార్టీ వచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ స్వగ్రామమైన కేరెళ్లి గ్రామ ఓటర్లు సైతం ఆయనకు షాక్ ఇచ్చారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 116 ఆధిక్యత వచ్చింది. 2018 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కూడా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి 1,105 ఆధిక్యత సాధించారు. ధారూరు మండలం కాంగ్రెస్‌కు కంచుకోట అని మరోసారి రుజువైందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రసాద్‌కుమార్ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయారు.

శ్రేణుల్లో నూతనోత్సాహం

బషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి విజయంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఆదివారం ఆ పార్టీ శ్రేణులు బషీరాబాద్‌లో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, వారి కుటుంబం, ఎంపీపీ కరుణ దంపతులు, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర నాయకులు ప్రచారం చేశారు. మేజర్ పంచాయతీల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ పైచేయి సాధించినప్పటికీ ఆ పార్టీ నేతలకు చివరకు నిరాశే మిగిలింది. తండాలు పూర్తిగా కాంగ్రెస్‌కు అండగా నిలిచాయి.

తిర్మలాపూర్ సంబురాలు..

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బుయ్యని మనోహర్ రెడ్డి కుల్కచర్ల మండల ప్రాథమిక సహకార సంఘ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తూనే అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించేందుకు ప్రయత్నించగా అధికార పార్టీ నుంచి నిరాశ ఎదురయ్యింది. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం లభించడంతో తాండూరు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో నిలిచారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన స్వగ్రామం తిర్మలాపూర్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. కుల్కచర్ల మండల వ్యాప్తంగా మనోహర్ రెడ్డి విజయం పట్ల విజయోత్సవాలను నిర్వహించారు.


కుల్కచర్ల: తిర్మలాపూర్‌లో టపాసులు పేల్చుతున్న నేతలు

ఆరు గ్యారంటీలు అమలుచేస్తాం


ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్

వికారాబాద్ అర్బన్: రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించాక మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచిందని.. వికారాబాద్ ప్రజలు తనకు సుమారు 12,500 మెజార్టీతో పట్టంకట్టారని అన్నారు. వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తానని తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రసాద్‌కుమార్ విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయారు. టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు..

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ విజయానికి దోహదపడిన వికారాబాద్ పట్టణ ఓటర్లకు ఎప్పుడూ రుణపడి ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. ఆదివారం కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న ప్రసాద్‌కుమార్‌ను చైర్‌పర్సన్ మంజుల ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ.. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి సుమారు 4వేల ఓట్ల ఆధిక్యత వచ్చిందన్నారు. ప్రసాద్‌కుమార్ సహకారంతో భవిష్యత్‌లో వికారాబాద్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె తెలిపారు.

ధారూరు మండలంలో..

ధారూరు: వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో ధారూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలు, తండాల్లో డీజేలు, బ్యాండ్ మేళాలతో రేవంత్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ధారూరు మండల అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, నాయకులు ఉన్నారు.

మర్పల్లిలో సంబురాలు..

మర్పల్లి: వికారాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ సుమారు 12వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందటంతో మర్పల్లి మండలంలో ఆపార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్లు ముందుగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు విమలమ్మ, నాయకులు దివాకర్, గణేశ్, మల్లేశ్‌యాదవ్, సర్వేశ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రావణ్, బలవంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జాఫర్, రతన్ తదితరులు ఉన్నారు.

బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో..

బంట్వారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపొందడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ముందే వెళ్లిపోయిన ఆనంద్..

వికారాబాద్ అర్బన్: బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్ ఆరు రౌండ్లు మిగిలి ఉండగానే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు. వికారాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 21 రౌండ్లు ఉండగా 15వ రౌండ్ ముగిసే సరికి కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ సుమారు 7,500 లీడ్‌లో ఉన్నారు. మిగతా రౌండ్లలో బంట్వారం, ధారూరు మండలాలు ఉండటంతో అక్కడ కాంగ్రెస్ బలంగా ఉందనే విషయం తెసిన ఆనంద్.. తన గెలుపు అసాధ్యమని గ్రహించి అనుచరులతో కౌంటింగ్ కేంద్రం నుంచి ముందే వెళ్లిపోయారు.